

విజిలెన్స్ తనిఖీలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు కలసి సోమవారం తనిఖీలు నిర్వహించారు.



ఉర్దూ పాఠశాలల సందర్శన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎంపీపీ ఉర్దూ పాఠశాల, జడ్పీ ఉర్దూ పాఠశాలను సమగ్ర శిక్ష అసిస్టెంట్ స్టేట్ ఐఈడీ కోఆర్డినేటర్ జి.మల్లికార్జున సందర్శించారు.



ఆక్రమణల తొలగింపు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో గాంధీ పార్కు రోడ్డులో ఆక్రమణల తొలగింపు సోమవారం కొనసాగింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ జడ్.సుధాకర్ పరిశీలించారు.

న్యూస్‌రీల్

హెల్మెట్ ధరించక పోవటం నేరం



నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించక పోవటం ప్రమాదకరమే కాదు, నేరం కూడా అని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎస్.సత్యశ్రీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అదనపు జిల్లా కోర్టు హాల్లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మోటారు వాహనాలు నడిపే వారు మాత్రమే కాకుండా వెనుక కూర్చున్న వారు కూడా విధిగా హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు పూర్ణిమ, ఆశీర్వాదం పాల్, ప్రవల్లిక, ఎంవీఐ శ్రావ్య, ట్రాఫిక్ ఎస్‌ఐ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుల కొనసాగింపునకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి కాంట్రాక్టు పద్ధతిపై కొనసాగేందుకు అర్హులైన అధ్యాపకులు మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు దరఖాస్తులు అందజేయాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 30వ తేదీ నాటికి కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేసిన వారే దరఖాస్తుకు అర్హులని ఆమె స్పష్టం చేశారు.

యార్డుకు 29,187 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,187 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,159 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 19,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ. 18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14.317 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

వైద్య సిబ్బంది పదోన్నతులకు దరఖాస్తు చేసుకోండి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ, మేల్) పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీహెచ్‌ఓ పోస్టులకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎంపీహెచ్ ఈఓగా పనిచేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓల సమాచారాన్ని వారి సర్వీసు రిజిస్టర్లను, ఇతర వివరాలను ఈనెల 12వ తేదీలోపు గుంటూరు ఆర్డీ కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

విద్యాశాఖ సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ మెరిట్ కార్డులు

గుంటూరు ఎడ్యుకేషన్: గతేడాది డిసెంబర్ 3న జరిగిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను ప్రభుత్వ పరీక్షల విభాగ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం తెలిపారు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో ఉంచిన మెరిట్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, వివరాలు సరిగా ఉన్నవీ, లేనివీ తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 31లోపు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత పాఠశాల నోడల్ అధికారితో పాటు జిల్లా నోడల్ అధికారి లాగిన్ ద్వారా అమోదింపజేసుకోవాలని తెలిపారు. ముద్రించిన మెరిట్‌కార్డులను త్వరలో డీఈఓ కార్యాలయం నుంచి పొందవచ్చునన్నారు. ఒకవేళ వివరాల్లో ఏమైనా తప్పులున్నట్లయితే ఆధార్ మిస్‌మ్యాచ్ వివరాలను సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా డీఈఓ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. విద్యార్థి ఆధార్ విద్యార్థి పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాకు విధిగా అనుసంధానం చేయబడి, డీబీటీ ద్వారా నగదు జమయ్యే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.



వేమూరులో జరిగిన వేడుకల్లో సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, నేతలు



చీరాలలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సునీత

రాజన్నా.. నువ్వు గుండెల్లో పదిలం

- వాడవాడలా మహానేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు
- విగ్రహాలకు క్షీరాభిషేకాలు, పేదలకు అన్నదానాలు

బాపట్ల: మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు బాపట్ల జిల్లాలో సోమవారం వైభవంగా సాగాయి. వాడవాడలా ఆయన విగ్రహాలకు క్షీరాభిషేకాలతో పాటు అన్నదానాలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు భారీగా పాల్గొన్నారు.

✦ బాపట్ల నియోజకవర్గంలో మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆధ్వర్యంలో స్థానిక మూర్తి రక్షణ నగర్, డీఎం పల్లె, కర్లపాలెం రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేపట్టారు. బాపట్ల పట్టణంలో భారీ ప్రదర్శన చేపట్టారు.

✦ వేమూరు నియోజకవర్గంలో ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భట్టిప్రోలులో అన్నదానం చేపట్టారు. కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

✦ రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలంలో ఇన్‌చార్జి ఈవూరి గణేష్ ఆధ్వర్యంలోమహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రామంలో పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.



డీఎం పల్లిలో నిర్వహించిన వేడుకల్లో మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, నేతలు

✦ చీరాల నియోజకవర్గంలో ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు ఆదేశాలు మేరకు పార్టీ నాయకులు స్థానిక గడియారం స్తంభం వద్ద కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

✦ వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ఆధ్వర్యంలో కావూరివారిపాలెంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు.

✦ పర్చూరు నియోజకవర్గంలో యడం బాలాజీ సోదరుడు దీపక్ ఆధ్వర్యంలో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పర్చూరు మండంలోని ఇడుపులపాడులో అన్నదానం చేపట్టారు.

✦ అద్దంకి నియోజకవర్గంలో ఇన్‌చార్జి పాన్నెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వేడుకల్ని ఘనంగా నిర్వహించారు.



అద్దంకిలో నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చిన హనిమిరెడ్డి



నివాళులర్పిస్తున్న రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి ఈవూరు గణేష్


బంగారం పంపుతానని మోసం

- రూ.2.45 లక్షలు బదిలీ చేసిన మహిళ

బల్లికురవ: బంగారం పేరుతో బురిడీ కొట్టించి ఓ మహిళ నుంచి నగదు బదిలీ చేయించుకున్నారు కేటుగాళ్లు. ఈ ఘటన మండలంలోని కొణిదెన గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ వి. రవిశంకర్‌రెడ్డి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ దరియావలి, చోటీబీ కుమార్తె షర్మిలకు 2004లో యద్దనపూడి మండలం జాగర్లమూడి గ్రామానికి చెందిన షేక్ నాయబ్ రసూల్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలతో రెండేళ్ల కిందట షర్మిల విడాకులు తీసుకుని పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నెల 1న ఆమె మొబైల్ నంబర్‌కు ఓ దుండగుడు ఫోన్ చేసి హిందీలో మాట్లాడి, అనాథ అని పరిచయం చేసుకున్నాడు. బంగారం పంపుతానని వాట్సాప్‌లో ఫొటోలు చూపించాడు. అడ్రస్ తీసుకుని కొరియర్ చేస్తానని నమ్మబలికి, రూ. 25 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. మరో నంబర్ నుంచి ఫోన్ చేసి ఇన్‌కంట్యాక్స్ వాళ్లు పార్సిల్ పట్టుకున్నారని సొమ్ము పంపాలని చెప్పడంతో షర్మిల పలు దఫాలుగా రూ.1 లక్ష, రూ.70 వేలు, రూ. 50 వేలు ట్రాన్స్‌ఫర్ చేసింది. బంగారం రాకపోవడంతో మోసపోయాయని గ్రహించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ



నీటిమట్టం సోమవారం 503.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 813.90 అడుగుల వద్ద ఉంది.

ఉచిత ఇసుకతో నిర్మాణ రంగానికి మేలు

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

కొల్లూరు : ఉచిత ఇసుక విధానం వల్ల నిర్మాణ రంగానికి మేలు చేకూరుతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. మండలంలోని జువ్వలపాలెం కృష్ణానది వద్దనున్న ఇసుక స్టాక్ పాయింట్‌లో సోమవారం అమ్మకాల ప్రారంభోత్సవంలో ఆయన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకొస్తూ నూతనంగా విడుదల చేసిన జీవో వల్ల జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం ఆరు స్టాక్ పాయింట్ల ద్వారా 72 వేల మెట్రిక్ టన్నుల సరఫరా జరుగుతుందని తెలిపారు. గృహ నిర్మాణదారులు ఆందోళనకు లోనవకుండా, తమకు అందుబాటులో ఉన్న స్టాక్ పాయింట్ల ఇసుకను పొందవచ్చని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర మెట్రిక్ టన్ను రూ. 88కు తోడు, తవ్వకానికి, రవాణాకు అయిన ఖర్చులు కలుపుకొని ఆయా ప్రాంతాల్ని బట్టి ధరలు నిర్ణయించామని కలెక్టర్ వివరించారు. ఇసుక అవసరం ఉన్న వ్యక్తులు ఆధార్ కార్డుతో స్టాక్ పాయింట్ వద్ద నిర్ణీత ధరను చెల్లించి రోజుకు 20 మెట్రిక్ టన్నులు పొందవచ్చునని



జువ్వలపాలెంలో ఇసుక అమ్మకాలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి, వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

పేర్కొన్నారు. ఇసుక అవసరం ఉన్న వ్యక్తులే వాహనాలను బాడుగ చెల్లించుకొని తీసుకొచ్చుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. ఎవరైనా వ్యక్తులు అవసరానికి మించి ఇసుక భారీగా నిల్వలు చేసినా, అధిక ధరలకు విక్రయించుకోవడానికి ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ చర్యలతో పాటు, రూ. 2 లక్షల పెనాల్టీ విధిస్తామని తెలిపారు. సెబ్ యంత్రాంగంతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేయించనున్నట్లు చెప్పారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్ని అమలు చేయడంలో భాగంగా ప్రధానమైన ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంతో నిర్మాణదారుకు భారం తగ్గుతుందని చెప్పారు. ఇసుక అందుబాటులోకి రావడంతో ఇన్నాళ్లు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిర్మాణ రంగ కార్మికులకు లబ్ధి చేకూరడంతోపాటు, ఆ రంగం ముందంజలో ఉండి రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

బండ్లమ్మ సేవలో ప్రముఖ సినీ గాయకుడు సింగర్ మనో

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో గల బండ్లమ్మ దేవాలయాన్ని ఆదివారం ప్రముఖ సినీ గాయకుడు సందర్శించారు. ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో కూష్మాండ దీపాలు వెలిగించారు. ఆయన వెంట పెద్ద కుమారుడు, తమిళ హీరో శ్రీ ధ్రువ, చిన్న కుమారుడు, గాయకుడు మనో రఫీ ఉన్నారు. ఈవో నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో వేద ఆశీర్వచనం జరిపించి, శాలువా కప్పి, అమ్మవారి జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా మనో మాట్లాడుతూ ఈ ఆలయానికి తొలుత వచ్చినప్పుడు తన మనసు చాలా సంతోషపడిందని తెలిపారు. తాను అనుకున్న ఒక కోరిక కూడా నెరవేరిందని, అందుకే మరోసారి వచ్చినట్లు చెప్పారు. జయ జయ మహదేవ అనే అద్భుతమైన పాటను అమ్మవారి సన్నిధిలో ఆలపించారు.



మనోకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో

నిర్ణయించిన మేరకే రవాణా చార్జీలు వసూలు చేయాలి

నెహ్రూనగర్: ప్రభుత్వం ఉచిత ఇసుక రవాణా పథకంలో భాగంగా జిల్లా స్థాయి కమిటీ ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయించిన మేరకే రవాణా చార్జీలు వసూలు చేయాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. సోమవారం లారీ, ట్రాక్టర్స్ యాజమానులతో ఆయన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు టైర్ల లారీకి 15 కిలోమీటర్ల వరకు రూ.2వేలు, 16 నుంచి 30 కిలోమీటర్ల వరకు రూ.3,500, 31 నుంచి 45 కిలోమీటర్ల వరకు 4,500, 46 నుంచి 60 కిలోమీటర్ల వరకు రూ.5500 వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. 10 టైర్, 12 టైర్ లారీలకు కొద్ది మేర వ్యత్యాసంతో రవాణా చార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. ట్రాక్టర్లకు రూ.1500 నుంచి రూ.3,500 వరకు మాత్రమే వసూలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

అరుణతార ఆవిర్భావం ఇక్కడే !

- మార్క్సిస్టు పార్టీ తొలి సన్నాహక సదస్సుకు వేదిక తెనాలి
- కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పరిణామం
- చరిత్రలో తెనాలి కన్వెన్షన్‌గా పేరుపొందిన ఘట్టం
- నేటితో సదస్సుకు అరవై వసంతాలు పూర్తి

తెనాలి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకత్వంలో ఆంతరంగిక పోరాటం, ఆ పార్టీ చీలికకు దారితీయటం, చీలికవర్గం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)గా పునర్నిర్మాణం చెందటం చరిత్ర. ఇందుకోసం జరిగిన జాతీయస్థాయి సన్నాహక సదస్సుకు పోరాటాల పురిటిగడ్డ తెనాలి ఆతిథ్యమిచ్చింది. తెనాలి కన్వెన్షన్‌గా పిలిచిన ఈ సదస్సు జరిగి నేటితో అరవై వసంతాలు.

32 మంది తిరుగుబావుటాతో..

భారత కమ్యూనిస్టు పార్టీలోని ఒక సెక్షన్ పోకడలపై నాయకత్వంలో అసంతృప్తి నెలకొంది. 1961లో విజయవాడలో జరిగిన ఉమ్మడి పార్టీ చివరి మహాసభలోనూ ఈ విభేదాలు పరిష్కారం కాలేదు. కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యంగా ఉండటానికి ప్రజాతంత్ర విరుద్ధంగా జరుగుతున్న కార్యక్రమాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని, పార్టీలో ఐక్యతకు అన్ని స్థాయిల్లో చర్చలు జరగాలంటూ జాతీయ కౌన్సిల్‌కు ఇచ్చిన నోటీసును నాయకత్వం తిరస్కరించింది. దీనితో 32 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులు వాకౌట్ చేశారు. పార్టీని విప్లవ పంథాలో పునర్నిర్మించాలని వారు తీసుకున్న నిర్ణయం ప్రకారమే 1964 జూలై 9, 10, 11 తేదీల్లో తెనాలిలో జాతీయ సదస్సును నిర్వహించారు.



తెనాలి సదస్సులో పాల్గొన్న ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ జాతీయ కౌన్సిల్ నుంచి వాకౌట్ చేసిన సభ్యులు

విజయవాడలో అనుమతి లేక..

తొలుత ఈ సదస్సును విజయవాడలో జరపాలని ఆలోచించారు. తగిన అనుకూల వాతావరణం ఆ రోజున విజయవాడలో లేదు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ మధ్య విభేదాలు, ఉద్రిక్తతలే ఇందుకు కారణం. పోలీసులు కూడా అనుమతించలేదు. ఫలితంగా సదస్సును తెనాలికి మార్చారు. అప్పట్లో కమ్యూనిస్టు ఉద్యమానికి తెనాలి అండగా ఉండేది. తెనాలిలో సదస్సు నిర్వహణకు జాతీయ కౌన్సిల్ వాకౌట్ సభ్యులు నిర్ణయించినట్టు వార్త రావటం ఆలస్యం, మరో గంటలోనే పట్టణంలోని లాడ్జీలు, హోటళ్లనన్నింటినీ ప్రభుత్వ అధికారులే బుక్ చేశారు. పార్టీ ప్రతినిధులు, నాయకులకు ఎక్కడా వసతి దొరకని పరిస్థితిని కల్పించారు. ప్రత్యామ్నాయంగా పట్టణ చెంచుపేటలోని కోనేరు పక్కన ఖాళీగా ఉన్న రైస్‌మిల్లును సదస్సు ప్రధాన ప్రాంగణంగా ఉపయోగించారు. మిల్లు పేరు రాజరాజేశ్వరి రైస్‌మిల్లు. ప్రతినిధుల భోజనశాలకు పక్కనే తాటాకు పాక వేశారు. సదస్సు ప్రాంగణానికి కోటేశ్వరనగర్‌గా నామకరణం చేశారు.

బసవపున్నయ్య డాక్యుమెంట్‌తో..

తెనాలి సదస్సులో మార్క్సిస్టు పార్టీ కార్యక్రమం, ఎత్తుగడలపై చర్చలో జ్యోతిబసు, బసవపున్నయ్య, నంబూద్రిపాద్‌లు వేర్వేరు డాక్యుమెంట్లను సమర్పించారు. వీటిపై సదస్సులో విస్తృతంగా చర్చ జరిగింది. ఎక్కువమంది మాకినేని బసవపున్నయ్య డాక్యుమెంటునే అంగీకరించటంతో అదే సీపీఎం కార్యక్రమంగా రూపొందించారు. నాలుగో రోజైన జులై 12న గాడిబావి సెంటర్లో బహిరంగసభ నిర్వహించారు. దాదాపు పదివేలమంది హాజరయ్యారు. బసవపున్నయ్య, సుందరయ్య, ప్రమోద్‌దాస్ గుప్త తదితరులు ప్రసంగించారు. సదస్సు ఏర్పాట్లను కామ్రేడ్ లావు బాలగంగాధరరావు, కొరటాల సత్యనారాయణ, పరుచూరు నాగేశ్వరరావు పర్యవేక్షించారు. పార్టీ అగ్రనాయకుడు మాకినేని బవసపున్నయ్య సతీమణి, బాలగంగాధరరావు సోదరి జగదాంబ తీవ్ర అస్వస్థతతో ఉండటంతో బాలగంగాధరరావు సదస్సు సమయంలో అక్కడ లేరు. సదస్సులో ప్రవేశపెట్టే పత్రాలను చాలవరకు బసవపున్నయ్య ఇంటివద్దనే తయారుచేశారు. చెంచుపేటకు చెందిన రావి హైమారావు, రావి అమ్మయ్య, పార్టీ కార్యకర్తలు సదస్సు ఏర్పాట్లలో సహకరించారు. గడ్డిపాటి కోటేశ్వరరావు, కొండ్రగంట వెంకటేశ్వర్లు, రాచాబత్తుని నాగేశ్వరరావు, గుదిబండి శివబసివిరెడ్డి, దేవా సీతారామయ్య, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, సింహాద్రి శివారెడ్డి తదితరులు వలంటీర్లుగా వ్యవహరించారు. కమ్యూనిస్టు ఉద్యమానికి తెనాలిలో గట్టి పట్టు ఉండటంతో అగ్రనేతల భావనకు తగినట్టుగా తెనాలి సదస్సు విజయవంతమైంది. స్వాతంత్ర్యానికి పూర్వమే ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తెనాలి అసెంబ్లీ (తెనాలి, రేపల్లె కలిపి)కి ఏకైక కమ్యూనిస్టు ఎమ్మెల్యేగా పిల్లలమర్రి వెంకటేశ్వర్లు విజయం సాధించారు. 1952లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన ఎన్నికల్లోనూ తెనాలి కమ్యూనిస్టు నేత రావి అమ్మయ్య గట్టి పోటీనిచ్చారు. మున్సిపాలిటీలోనూ కమ్యూనిస్టు పార్టీ బలమైన ప్రతిపక్షంగా ఉండేది.

దేశం నలుమూలల నుంచి 146 మంది ప్రతినిధులు

సదస్సుకు దేశవ్యాప్తంగా 146మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి 23 మంది చొప్పున హాజరుకాగా, తమిళనాడు నుంచి 20, కేరళ నుంచి 19, ఉత్తరప్రదేశ్ 15, రాజస్థాన్, పంజాబ్, అస్సాం, ఢిల్లీ, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్నుంచి 40 మందికిపైగా పాల్గొన్నారు. సీపీఐ జాతీయ సదస్సు నుంచి వాకౌట్ చేసిన 32 మంది సభ్యులు హాజరయ్యారు. వీరిలో మార్క్సిస్టు పార్టీ తొలి పొలిట్‌బ్యూరోకు ఎన్నికైన పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, ఏకే గోపాలన్, ఈఎంఎస్ నంబూద్రిపాద్, జ్యోతిబసు, ప్రమోద్‌దాస్ గుప్త, హరికిషన్‌సింగ్ సూర్జిత్, పి.రామమూర్తి ప్రభృతులున్నారు. వీరితోపాటు పంజాబ్ నుంచి జగ్‌జిత్‌సింగ్ లాయల్‌పురి, బెంగాల్ నుంచి ముజఫర్ అహ్మద్, హరేకృష్ణ కోనార్, తమిళనాడు నుంచి ఎంఆర్ వెంకటరామన్, శంకరయ్య, కేరళ నుంచి ఈకే నయనార్, కనరన్, రాజస్థాన్ నుంచి మోహన్ పునామియా తదితరులున్నారు. బీటీ రణదివే జైలులో ఉన్నందున హాజరుకాలేదు.వాకౌట్ చేసిన సభ్యుల్లో మన రాష్ట్రంనుంచి పుచ్చపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్యతోపాటు నండూరి ప్రసాదరావు, మోటూరి హనుమంతరావు, తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, గుంటూరు బాపనయ్య, ఉద్ధంరాజు రామం ఉన్నారు. వీరితోపాటు గుంటూరుజిల్లా నుంచి కొల్లా వెంకయ్య, కృష్ణాజిల్లాకు చెందిన సనకా బుచ్చికోటయ్య, మానికొండ సుబ్బారావుతో సహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

క్లుప్తంగా

కర్నూలు - శ్రీకాకుళం మ్యాచ్ డ్రా

కర్నూలుకు 3, శ్రీకాకుళానికి 1 పాయింట్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో కర్నూలు, శ్రీకాకుళం మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆదివారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ ఒక వికెట్ నష్టానికి 30 పరుగులతో సోమవారం చివరిరోజు ఆట ప్రారంభించిన కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని సుమేథ్ భరద్వాజ్ 51 పరుగులు చేశాడు. శ్రీకాకుళం బౌలర్ కందుకూరి మనీష్‌కు 4 వికెట్లు లభించాయి. అనంతరం 296 పరుగుల విజయలక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. జట్టులోని రుత్విక్ సాగర్ 24పరుగులు చేయగా కర్నూలు బౌలర్ బి.మహిత్‌కు 4 వికెట్లు లభించాయి. తొలి ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు నమోదు చేసిన కర్నూలు జట్టుకు 3 పాయింట్లు, శ్రీకాకుళం జట్టుకు 1 పాయింట్ లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి. పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో టూరిజం ఉద్యోగి మృతి


రామారావు(ఫైల్)

విజయపురిసౌత్: రోడ్డు ప్రమాదంలో ఏపీ టూరిజం ఉద్యోగి మృతి చెందిన సంఘటన మాచర్ల మండలం ఏకనాంపేట వద్ద ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. విజయపురి సౌత్‌కు చెందిన కొదమగుండ్ల రామారావు(45) పర్యాటక కేంద్రం ఎత్తిపోతలలో కుక్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి విధులు ముగించుకొని విజయపురిసౌత్‌లోని ఇంటికి బైక్‌పై వెళుతుండగా ఏకనాంపేట వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం అతివేగంతో ఢీకొట్టింది. దీంతో రామారావు కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలోని హిల్ కాలనీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు.

మహానేతా... నిను మరువలేం !

అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి: పేదల సంక్షేమం కోసం అనుక్షణం తపించిన మహానేత, మహనీయుడు వైఎస్సార్ అని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. ప్రజల్లో వైఎస్సార్‌కు ఉన్న అభిమానం తరగనిదని తెలిపారు. జయంతి, వర్ధంతుల రోజుల్లో గ్రామాల్లో ఆయన విగ్రహాలకు నివాళులు అర్పించడం, అన్నదానాలు చేయడం దీనికి అద్దం పడతాయని చెప్పారు. వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో భాగంగా ఆయన పట్టణంలోని 20వ వార్డులో విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తరువాత నిర్వహించిన సభకు మాజీ కో ఆప్షన్ సభ్యుడు బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పానెం చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ పాలన దేశంలోనే ఆదర్శవంతమని తెలిపారు. అదే బాటలో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నడిచి మంచి పాలన అందించినా, కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. దానికి ప్రజలు ఓడిపోయి బాబు గెలిచాడని చెప్పుకోవచ్చన్నారు. ఏదో జరిగిందనే అనుమానం అందిరికీ ఉందని, దానికి సాక్ష్యం లేదని తెలిపారు. ఎప్పుడో ఒకప్పుడు అబద్ధం బయట పడకపోదని, దానికి వారు శిక్ష తప్పనిసరిగా అనుభవిస్తారని హనిమిరెడ్డి చెప్పారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. కష్టసుఖాల్లో భాగం పంచుకుంటానని, అండగా ఉంటానని తెలిపారు. గ్రామ గ్రామాన తిరిగి పార్టీని బలోపేతం చేసే దిశగా పయనిద్దామని చెప్పారు. తనపై ఎల్లో మీడియా రాతలు అమానుషమని ఖండించారు. ఉడత ఊపులకు భయపడేది లేదని, బెదిరింపులకు జడుచుకనేది లేదని స్పష్టం చేశారు. అన్నింటికీ సిద్ధంగా ఉన్నానన్నారు. తాను ఇక్కడే ఉంటానని, 2029లోనూ ఇక్కడ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మండల కన్వీనర్ జి. జగన్‌మోహన్‌రెడ్డి, బి.వి.కె. రెడ్డి, కొల్లా భువనేశ్వరి, గుంజి కోటేశ్వరరావు, ఈదా శ్రీనివాసరెడ్డి, నగేశ్ తదితరులు వైఎస్సార్ గురించి, పార్టీ బలోపేతం గురించి మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు యర్రం రత్నారెడ్డి, ఎల్. రవి, కౌన్సిలర్లు బాలు, జబ్బార్, వీరయ్య, బాషా, నాయకులు గూడా శ్రీనివాసరెడ్డి, లావణ్య జ్యోతి, వడ్లవల్లి ఆంజనేయులు, ఊడత్తు సురేశ్, వార్డు ఇన్‌చార్జులు, పట్టణ,మండల, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహనీయుడు వైఎస్సార్

చీరాల: తెలుగు రాష్ట్రాల్లో ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి మనసులో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి వైఎస్. రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం చీరాల రూరల్ మండలం కావూరివారిపాలెం పంచాయతీలోని తులసీనగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువుకు చేయూతనందించి, ఆరోగ్యశ్రీ ద్వారా ఎన్నో పేద కుటుంబాలకు సంపూర్ణ సహకారాన్ని అందించారని తెలిపారు. వైఎస్సార్ జీవితానంతరం కూడా పేదల గుండెల్లో నిలిచే ఉంటారని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలలో ఉండాలని అనేక సంక్షేమ పథకాల్ని ప్రజల చెంతకు తెచ్చారని వివరించారు. అనారోగ్యాంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. వ్యవసాయం దండగ కాదు పండుగ అని చెప్పి రైతుబాంధవుడిగా పేరొందారన్నారు. వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. సంక్షేమ, ఆరోగ్యప్రదాతగా, అపర భగీరథుడుగా ఆయన నిలిచారని కొనియాడారు. తండ్రి బాటలోనే తనయుడు, మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసి రాజన్న రాజ్యాన్ని ప్రజలకు అందించారని సునీత పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బంకా వాసుబాబు


వాసుబాబు

సత్తెనపల్లి: పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా అచ్చంపేట మండలం వేల్పూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బంకా వాసు బాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా శాఖ అత్యవసర సమావేశం సోమవారం నరసరావుపేట శంకరభారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు కె.శ్యామ్ మోసెస్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో గతంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఎం.వెంకటేశ్వరరావు వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానంలో బంకా వాసుబాబుని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాసు బాబు మాట్లాడుతూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీఓ 117ను రద్దు చేయాలని, అమ్మకు వందనం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపచేయాలన్నారు. సంఘ బాధ్యులు ఎ.హనుమంతరావు, ఏడుకొండలు, రఫీ, ఖాజావలి, విజయరాజు, కె. అబ్దుల్ సత్తార్, సీహెచ్. ఏడుకొండలు, సత్తార్, సీనియర్ సభ్యులు సీవీఎస్ మణి పాల్గొన్నారు.

అసాంఘికవాదులపై చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విన్నవించిన ఎంఐఎం నాయకులు


కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంఐఎం నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని కొందరు వ్యక్తులు ఆర్కెస్ట్రా ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నాయకులు షేక్ కరీముల్లా, మౌలాలీ కోరారు. ఈ మేరకు సోమవారం వారు మీకోసం కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విన్నవించారు. రాత్రి పూట గంజాయి, మద్యం తాగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ , అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి నగర బహిష్కరణ చేయాలని కోరారు. పొట్టకూటి కోసం ఆర్కెస్ట్రాలో పనిచేసే మహిళలకు జీవనోపాధి కల్పించి, ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. దీనిపై కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పందించి వెంటనే ఓ కమిటీ వేసి, ఎంతమంది ఆర్కెస్ట్రా నిర్వాహకులు ఉన్నారు .. వారిలో ఎంత మంది మహిళలు ఉన్నారో గుర్తించి, తప్పకుండా జీవనోపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలియజేశారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడి


ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు

పిడుగురాళ్ల: వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు పిడుగురాళ్ల పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలపై సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి షాపు యజమానుల వద్ద సోర్స్ సర్టిఫికెట్ లేని స్టాక్ అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ స్టాక్ విలువ సుమారు రూ.6,58,740 ఉందని అధికారులు తెలిపారు. రైతులకు ఎమ్మార్పీ కంటే అదనంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మినట్లయితే దుకాణాల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయశాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, ఏడీఏ వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్ఐ డి. రవికుమార్, ఏఓ ప్రవీణ్‌కుమార్, పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ నందిపాటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై వేధింపులు ఆపండి

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సీపీఎం నాయకులు


కలెక్టరేట్‌లో మీకోసంలో ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై చేస్తున్న రాజకీయ వేధింపులు వెంటనే మానుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా రాజకీయ వేధింపులు జరుగుతూనే ఉండటం శోచనీయమన్నారు. సోమవారం కలెక్టరేట్ మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. అనంతరం విజయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ వేధింపులు, కక్షపూరిత రాజకీయాలు ఉండవని చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో టీడీపీ, జనసేన నాయకులు తమ అనుయాయులకు ఉద్యోగాలు కట్టబెట్టేందుకు స్కీం వర్కర్లు, కాంటాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. బలవంతంగా రాజీనామాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, చేయకపోతే దూషించడంతోపాటు భౌతికంగా దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలను సెంటర్ నుంచి బలవంతంగా లాగటం, కేంద్రాలకు తాళాలు వేయడంతో పాటు ఆశా వర్కర్లపై ఆయా మండల వైద్యాధికారులకు ఫిర్యాదు చేసి తొలగించాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాలలో రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని, వీటిపై జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేసి చిరు ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. వేధింపులు ఆపకపోతే స్కీమ్ వర్కర్లు, ప్రజా సంఘాలను ఏకం చేసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నాయకులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయ నాయక్, సరికొండ వెంకటేశ్వర రాజు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోట సాయి కుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ తైక్వాండోలో మెరిసిన చీరాల క్రీడాకారులు

ఎనిమిది మందికి బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల రూరల్: అంతర్జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో చీరాల క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. పొదునైన షాట్‌లతో ప్రత్యర్థులను బెంబేలెత్తించిన ఎనిమిది మంది క్రీడాకారులు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఇటీవల నేపాల్ దేశంలోని ఖాఠ్మండులో పీసీఏ స్పోర్ట్స్ ఈమెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ నేపాల్ ఆధ్వర్యంలో ఇండో–నేపాల్ ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్–2024 పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రపంచంలోని ఆరు దేశాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాలోని చీరాల తైక్వాండో క్లబ్ తరఫున 12 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో 8 మంది బంగారు పతకాలు సాధించారు. ఓవర్ వెయిట్ సీనియర్ విభాగంలో పిల్లి ప్రశాంత్‌బాబు, అండర్–48 జూనియర్ విభాగంలో పిల్లి స్టీఫెన్ జాన్‌పాల్, అండర్–58 క్యాడెట్ విభాగంలో పిల్లి మేరిస్టెల్లా, అండర్–44 సబ్‌జూనియర్ విభాగంలో షేక్ మహమ్మద్ సోహెల్, అండర్–36 కేజీల క్యాడెట్ విభాగంలో ఎస్. వెంకటరమణ, అండర్–65 కేజీల క్యాడెట్ విభాగంలో షేక్ అబ్దుల్ ఆషిక్, అండర్–48 కేజీల జూనియర్ విభాగంలో షేక్ కాలేషా వలి, అండర్–33 కేజీల జూనియర్ విభాగంలో లేళ్ల కార్తిక్‌లు బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు చీరాల తైక్వాండో కోచ్ సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. ఈ ఏడాది మేలో గోవాలో నిర్వహించిన ఏడో నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో 13 మంది బంగారు పతకాలు, ఐదు సిల్వర్ మెడల్స్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు, కోచ్‌లు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను కలిశారు. కార్యక్రమంలో కోచ్‌లు సయ్యద్ సలావుద్దీన్, ప్రశాంత్‌బాబు, వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న స్కూలు యాజమాన్యం

- ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల టీమ్ చాంపియన్‌షిప్ కైవసం
- విద్యార్థులకు అభినందనల వెల్లువ

చీరాల రూరల్: స్థానిక మరియమ్మపేటలోని సెయింట్ ఆన్స్ స్కూలు విద్యార్థులు జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. రాజమండ్రిలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూలులో ఈనెల 4, 5, 6 తేదీల్లో ఐసీఎస్ఈ ఆంధ్రా, తెలంగాణ రీజినల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఇందులో 17 ఏళ్ల విభాగంలో సెయింట్ ఆన్స్ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టీమ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుని సత్తా చాటారు. విద్యార్థులు వై.తారక్‌రామ్, చరణ్‌తేజ్, ప్రేమ్‌కుమార్, విహాస్ జోషి, విపిన్, నిఖిల్‌సాయి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం దక్కినట్లు స్కూలు ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవియర్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం స్కూలు యాజమాన్యం అభినందన సభ నిర్వహించి, ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ ఎల్లా ట్రెస, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభం


అన్నె రత్నప్రభాకర్‌కు పురస్కారం ప్రదానం


ఇంద్రప్రస్థ నాటికలో ఓ సన్నివేశం

తెనాలి: కళల తెనాలిలో కళావారసత్వాన్ని సజీవం చేస్తూ వివిధ పరిషత్‌లు నాటికోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి చెప్పారు. రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్–తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం నుంచి సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన ప్రారంభ సభకు ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజకుమారి తన ప్రసంగంలో సమాజ చైతన్యానికి నాటకాలు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు ఆ దిశగా ఉపకరిస్తాయని భావిస్తున్నట్టు చెప్పారు. రోటరీలో ఉత్తమ సేవలు అందించిన పూర్వ జిల్లా గవర్నర్ అన్నె రత్నప్రభాకర్‌కు రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారీస్ పురస్కారంతో సత్కరించారు. డాక్టర్ సోమవరపు వెంకట రాంప్రసాద్, రోటరీ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ గుత్తా వెంకటరత్నం మాట్లాడారు. తొలుత అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' నాటికను ప్రదర్శించారు. స్నిగ్ధ రచించిన నాటికకు ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా చైతన్య కళాభారతి, కరీంనగర్ సమాజం 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికను ప్రదర్శించారు. బీఎస్ నారాయణ మూలకథను పరమాత్ముని శివరాం నాటకీకరించగా, మంచాల రమేష్ దర్శకత్వంలో ప్రదర్శించారు. చివరగా మిత్రా క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'అందిన ఆకాశం' నాటికను ప్రదర్శించారు. సాయిపద్మశేఖర్ రచనకు, ఎంఎస్ బాషా దర్శకత్వ పర్యవేక్షణ చేశారు.

రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, నల్లూరి వెంకటేశ్వర్లు, డి.మురళీకృష్ణ, అరవపల్లి శ్రీకాంత్, కాకుమాను ఉపేంద్ర, జాన్ కీట్స్, ఆలపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీలో టీసీఎస్-ఎన్‌క్యూటీ ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టీసీఎస్–ఎన్‌క్యూటీ (నేషనల్ క్వాలిఫైడ్ టెస్ట్) ఇంటర్వ్యూలను సోమవారం టీసీఎస్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీసీఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో బీటెక్ పూర్తి చేసి ఎన్‌క్యూటీ (నేషనల్ క్వాలిఫైడ్ టెస్ట్) ద్వారా ఎంపికైన విద్యార్థులకు విజ్ఞాన్ వర్సిటీలో ఇంటర్వ్యూలు నిర్వహిసున్నట్లు తెలిపారు. ఈ మెగా డ్రైవ్‌కు ఉమ్మడి గుంటూరు, కృష్ణ, వైజాగ్ ప్రాంతాల్లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన మూడు వేల మంది హాజరవుతారని తెలిపారు. ఇంటర్వ్యూలో సత్తా చాటిన విద్యార్థులకు టీసీఎస్–నింజా రూ.3.39 లక్షలు, టీసీఎస్–డిజిటల్ రూ.7 లక్షలు, టీసీఎస్ ప్రైమ్ రూ.9 లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు, విజ్ఞాన్ వర్సిటీ వైస్ చాన్సలర్ పీ.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణికోటలో యువకుడి హత్య

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామానికి చెందిన యువకుడిని బంధువులే హత్య చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈసంఘటనపై అమరావతి సీఐ ఎ.వి.బ్రహ్మం అందించిన సమాచారం ప్రకారం.. ధరణికోట గ్రామానికి చెందిన నర్రా భార్గవ్(30) చిన్ననాడే తల్లి చనిపోవటంతో అమరావతిలో ఉంటున్న పెద్దమ్మ నూతలపాటి చిట్టెమ్మ పెంచిపెద్ద చేసి వివాహం కూడా చేసి ధరణికోటలో నివాసం ఉండేవిధంగా ఏర్పాటు చేసింది. చిన్ననాటి నుంచి భార్గవ్ చెడు అలవాట్లకులోనై అల్లరిచిల్లరిగా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం భార్యకూడా పుట్టింటికి వెళ్లింది. కొద్దికాలం క్రితం పెద్దమ్మ నూతలపాటి చిట్టెమ్మ పేరుమీద ఉన్న పొలంలో కొంత భాగం భార్గవ్ తన పేరు మీద రాయించుకుని అమ్ముకుని జల్సాలు చేశాడు. మళ్లీ ఆదివారం రాత్రి అమరావతిలోని చిట్టెమ్మ నివాసానికి వచ్చి డబ్బుకోసం హింసిస్తున్న తరుణంలో కుమారుడు నూతలపాటి శ్రీనివాసరావుతోపాటుగా అతని బాబాయి నంబూరు శ్రీనివాసరావులు వచ్చి భార్గవ్‌పై దాడిచేశారు. దిండు ముఖంపై ఉంచి నొక్కడంతో ఊపిరాడక చనిపోయాడు. దీంతో వీరిద్దరూ భార్గవ్‌కు చెందిన బుల్లెట్ బండిని ధరణికోట ఆరుడొంకల బావి సెంటర్ సమీపంలో ఉన్న ఎన్ఎస్‌పీ కాలువ కట్టపై ఉంచి, మృతదేహాన్ని ధరణికోటలోని అతని నివాసం వద్దకు తీసుకువచ్చి తాత నర్రా ఉమామహేశ్వరరావుకు అప్పగించారు. ఆరుడొంకల బావి దగ్గర కాలువ కట్టపై చనిపోయి ఉన్నాడని, తాము తీసుకువచ్చామని నమ్మబలికారు. వీరిద్దరి ధోరణిపై అనుమానంతో సోమవారం ఉదయం ఉమామహేశ్వరరావు పోలీసులకు సమాచారమిచ్చి ఫిర్యాదు చేశాడు. ఉమామహేశ్వరరావు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టగా నూతలపాటి శ్రీనివాసరావు, నంబూరు శ్రీనివాసరావు హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం నిందితులు ఇద్దరూ పరారీలో ఉండగా వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు. మృతునికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.